క్లుప్తంగా

క్రయ,విక్రయదారులకు ఇబ్బంది కలగొద్దు

గంగాధర: రిజిస్ట్రేషన్ల కోసం కార్యాలయానికి వచ్చే క్రయ,విక్రయదారులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని జిల్లా రిజిస్ట్రార్ ప్రవీణ్‌కుమార్ గంగాధర సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బందికి సూచించారు. సబ్‌రిజిస్ట్రేషన్ ఆఫీస్‌ను గురువారం డీఆర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులు పరిశీలించి ఆఫీసు శుభ్రం ఉండాలని, రిజిస్ట్రేషన్ పనుల్లో జాప్యం చేయొద్దన్నారు. అనంతరం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం సొంత భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. వెంట గంగాధర సబ్‌రిజిస్ట్రార్ అఫ్జల్‌నూర్ ఖాన్, జూనియర్ అసిస్టెంట్ అజ్మత్‌అలీ, డీఆర్ సీసీ రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.

సన్మానం


పాలకవర్గాన్ని సన్మానిస్తున్న నాయకులు

సైదాపూర్: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు, సామాజిక కార్యకర్తలు సైదాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని గురువారం సన్మానించారు. చైర్మన్ సుధాకర్, కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుండారపు శ్రీనివాస్, సామాజిక కార్యకర్తలు గాదపాక కుమార్‌రాజు, గున్నాల కృష్ణమూర్తి తదితరులున్నారు.

క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఇల్లందకుంట: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థాన నిత్య అన్నదాన సత్రానికి నిధులు మంజూరు చేసినందుకు గురువారం మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు వంగ రామకృష్ణ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రవాణా, బీసీ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ అన్నదాన సత్రానికి రూ.35.25 కోట్ల మంజూరుకు కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలిపారు. డీసీసీ జనరల్ సెక్రటరీ సారంగపాణి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, నాయకులుతిరుపతిరెడ్డి, ఐలయ్య, జలందర్‌రెడ్డి, వీరారెడ్డి, సాయికుమార్, రమేశ్, సారంగం, దిలీప్, రాజబాబు, మదన్‌రావు, సదానందం, భోగం చిరంజీవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌సీని ప్రకటించాలి

హుజూరాబాద్: పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీ ప్రకటించాలని తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పొలంపల్లి ఆదర్శన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

కమిషనర్‌కు వినతి

హుజూరాబాద్: మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యకు 26వ వార్డు కౌన్సిలర్ కేసిరెడ్డి లావణ్య నర్సింహారెడ్డి, వార్డు ప్రజలు గురువారం వినతిపత్రం సమర్పించారు. కోతుల బెడద ఎక్కువగా ఉందని, చర్యలు తీసుకోవాలని కోరారు. కోతుల మూలంగా స్కూల్, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.

తహసీల్దార్‌కు..

హుజూరాబాద్: తహసీల్దార్ కె. కనకయ్యకు హుజూరాబాద్ జమే మసీద్ ఈద్గా ఖబ్రస్తాన్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్, నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ముస్లింలకు కేటాయించిన స్థలానికి ధరణిలో పేరు నమోదు చేయాలని వినతి పత్రంలో కోరారు.

సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలి

హుజూరాబాద్: ప్రభుత్వ కార్యాలయాల్లో వివిధ విభాగాలకు సంబంధించిన అధికారుల పేర్లు, ఫోన్ నెంబర్లతో కూడిన సమాచార బోర్డులను ఏర్పాటు చేయాలని సీపీఎం మండల నాయకులు కోరారు. డివిజన్ డీఈ కార్యాలయంలో అధికారుల ఫోన్ నెంబర్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అంతేకాకుండా వివిధ కార్యాలయాల్లో సైతం పరి స్థితి ఇలాగే ఉందని, వెంటనే బోర్డులను ఏర్పా టు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కదిరే రమేశ్, కొంకట చంద్రయ్య, దాట్ల రత్నాకర్ ఉన్నారు.

26న ఓటరు జాబితా సమావేశం

హుజూరాబాద్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 26న గ్రామ పంచాయతీ ఓటరు జాబితాపై సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో టీ. సునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఆయా రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు , తదితరులు ఉదయం 11 గంటలకు హాజరు కావాలని కోరారు.

ఇలా దరఖాస్తు.. అలా ఏర్పాటు

- తక్కువ ధరకే విద్యుత్ మీటరు
- పేదల ఇంట్లో విద్యుత్ వెలుగులు
- గృహజ్యోతి ఫలాలు అందించేందుకు కసరత్తు
- బీపీఎల్ కుటుంబాలకు ఇచ్చేలా కార్యాచరణ


సింగాపూర్ గ్రామంలో అవగాహన కల్పిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది

హుజూరాబాద్: విద్యుత్ మీటర్లు లేని నిరుపేదలకు విద్యుత్ సంస్థ (ఎన్పీడీసీఎల్) సువర్ణావకాశం కల్పిస్తోంది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు జీఎస్టీతో కలిపి రూ.938లకే విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో విద్యుత్ సిబ్బంది గ్రామాల్లో తిరిగి మీటరు లేని నిరుపేద ఇళ్లను గుర్తించి దరఖాస్తు చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. వారి నుంచి దరఖాస్తులు, మీటరు రుసుము తీసుకుని రశీదులు ఇవ్వడంతో పాటు రెండు రోజుల్లో ఇంటికి మీటరు బిగించేందుకు కార్యాచరణ చేపట్టారు. గతంలో ఇంటి విద్యుత్ కనెక్షన్ కోసం మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకొని కరెంటు లోడ్ ఆధారంగా రూ.వేలు చెల్లించాల్సి వచ్చేది. అయితే తాజాగా పేదలకు విద్యుత్ శాఖ అతి తక్కువ ధరకే మీటరు పొందడం సులభతరం చేసింది. 250 నుంచి 500 వాట్ల విద్యుత్ వినియోగించే పేదకుటుంబాలకు విద్యుత్ కనెక్షన్ కోసం సిబ్బందికి డబ్బులు చెల్లిస్తే చాలు నేరుగా రశీదులు ఇచ్చే ఏర్పాట్లు చేసింది.

నిరుపేద కుటుంబాలకు అవకాశం

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేద కుటుంబాలకు విద్యుత్ సంస్థ పథకాన్ని వర్తింపజేస్తోంది. అయితే 250 నుంచి 500 వాట్ల విద్యుత్ వినియోగించుకునే వారికి అవకాశం కల్పిస్తున్నారు. విద్యుత్ లోడ్ ఆధారంగా దరఖాస్తు ఫీజు, చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. 500 వాట్స్ వరకు విద్యుత్ వినియోగించుకునేవారు దరఖాస్తు ఫీజు రూ.25 (అదనంగా 18 శాతం జీఎస్టీ (రూ.4.51)), డెవలప్‌మెంట్ చార్జీ రూ.601 (అదనంగా 18 శాతం జీఎస్టీ (రూ.107)), సెక్యూరిటీ డిపాజిట్ రూ.201 చొప్పున మొత్తం రూ.938.51 చెల్లించాల్సి ఉంటుంది. 250 వాట్ల విద్యుత్ వాడకందారులు అప్లికేషన్ రుసుము రూ.25 (అదనంగా 18 శాతం జీఎస్టీ రూ.4.51), డెవలప్‌మెంట్ చార్జీ రూ.601 (అదనంగా 18 శాతం జీఎస్టీ (రూ.109)), సెక్యూరిటీ డిపాజిట్ రూ.80 కలిపి మొత్తం రూ.817.50 చెల్లించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

గృహజ్యోతి ఫలాలు అందించేందుకు..

పల్లెలు, గ్రామాలు, కాలనీలు, తండాల్లో చాలా మంది పేదలు విద్యుత్ మీటర్లు లేకుండానే కరెంటును వినియోగించుకుంటున్నారు. అధికారికంగా విద్యుత్ కనెక్షన్, మీటరుకు డబ్బులు చెల్లించే స్తోమత లేకపోవడంతో ప్రభుత్వం 200 యూనిట్ల లోపు విద్యుత్‌ను ఉచితంగా అందించే గృహజ్యోతి పథకానికి దూరమయ్యారు. ఇలాంటి పేద కుటుంబాలకు తక్కువ ధరకే విద్యుత్ కనెక్షన్, మీటర్లు అందించేందుకు చర్యలు చేపట్టారు. ప్రజా పాలనలో జీరో బిల్లు కోసం దరఖాస్తు చేసుకోవడం ద్వారా గృహజ్యోతి పథకం పొందే అవకాశం ఉంది.

అర్హులు వినియోగించుకోవాలి



తక్కువ ధరకే విద్యుత్ కనెక్షన్, మీటరు అందించే సౌకర్యాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలి. అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ఆయా గ్రామాల్లో విద్యుత్ సిబ్బంది విద్యుత్ మీటర్లు లేని కుటుంబాలను గుర్తించేందుకు సర్వే చేపడుతున్నారు. మీటర్ కోసం దళారులను ఆశ్రయించొద్దు. విద్యుత్ సిబ్బంది వద్ద రశీదు తీసుకోవాలి. రెండు రోజుల్లో మీటరు బిగించేలా ఏర్పాట్లు చేశాం. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు ఎన్పీడీసీఎల్ సంస్థ సదవకాశాన్ని కల్పిస్తోంది.

– లక్ష్మారెడ్డి, డీఈ, హుజూరాబాద్

నిబంధన సవరించాలి



కూలినాలీ చేసుకుంటూ జీవించే మాకు పథకంపై అవగాహన లేదు. రేకుల ఇంటిలో బతుకుతున్నాం. మున్సిపాలిటీ అనుమతి ఉంటేనే మీటర్ ఇస్తామని అధికారులు చెబుతున్నారు. నిబంధనను సవరించి మా ఇంటికి విద్యుత్ మీటర్ బిగించాలి.

– కుర్ర భాస్కర్, స్థానికుడు, హుజూరాబాద్.

అవగాహన కల్పించాలి



గ్రామాల్లోని నిరుపేదలకు పథకం గూర్చి పూర్తి స్థాయిలో అవగాహన లేక అవకాశాన్ని కోల్పోతున్నారు. ఈ పథకాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలంటే గ్రామాల్లో వివిధ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించే చర్యలు చేపట్టాలి.

– దిలీప్‌రెడ్డి, మాజీ సర్పంచ్, వంతడుపుల



మానకొండూర్‌రూరల్: మండలంలోని ఊటూర్ గ్రామంలో ఎస్సారెస్పీ డీబీఎం-6 కెనాల్ ఉప కాలువ 4 ఎల్ సమీపంలో రైతులకు వ్యవసాయ భూములున్నాయి. కాలువ పక్కన ప్రభుత్వ భూమిని కొందరు రైతులు సాగు చేస్తున్నారు. దీంతో వెనకవైపు రైతులకు దారి లేకుండా అయింది. అధికారులు చర్యలు చేపట్టి దారి ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రమేశ్, ఏఈ, సెల్‌నంబర్: 73311 58024

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ


బీటీ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

గన్నేరువరం: రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. గుండ్లపల్లి నుంచి గన్నేరువరం మీదుగా రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పొత్తూరు వరకు చేపట్టిన డబుల్ రోడ్డు బీటీ పనులను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా గుండ్లపల్లి నుంచి గునుకులకొండాపూర్ వరకు బీటీ పనులను చేపడుతున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనాథ్‌రెడ్డి, కేడీసీసీబీ డైరెక్టర్ కోటి, మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణ, డీసీసీ ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, డైరెక్టర్ కనుకయ్యగౌడ్, రెడ్డి సంఘం మండల అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, కొమురయ్య, మల్లేశం, సంపత్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, నర్సింహారెడ్డి, లింగయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

చెడువ్యసనాలకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న జడ్జి పద్మసాయి

హుజూరాబాద్: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని హుజూరాబాద్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పద్మసాయి అన్నారు. మండలంలోని చెల్పూర్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై గురువారం అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, మంచివారితో స్నేహం చేయాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించాలన్నారు. క్రమశిక్షణతో చదువుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు.

సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలి


చిన్నపిల్లల వార్డును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

హుజూరాబాద్: సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ అన్నారు. పట్టణంలోని ఏరియా ఆసుపత్రిని గురువారం సందర్శించారు. ఆసుపత్రిలోని పలు వార్డులను పరిశీలించి. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండొద్దన్నారు. ఆసుపత్రికి వచ్చిన గర్భిణులు, బాలింతలతో వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, డాక్టర్ వెంకటరమణ, ఆర్‌ఎంవో సుధాకర్‌రావు, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్ ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

సైదాపూర్: వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం, సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని వెంకటరమణ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రిలో రోగుల సంఖ్య, వైద్య సిబ్బంది పనితీరు, ప్రసవాలు ఎలా జరుగుతున్నాయనే అంశాలపై ఆరా తీశారు. సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి కృష్ణకుమార్, సిబ్బంది ఉన్నారు.

క్రీడా వార్తలు

జాతీయ స్థాయి హామర్‌త్రో పోటీలకు ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న ఎంఈవో, టీచర్లు

జమ్మికుంట: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థి రేణికుంట మల్లికార్జున్ హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో బుధవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి హామర్ త్రో పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి గురువారం తెలిపారు. చదువుతోపాటు క్రీడలలో విద్యార్థులు రాణిస్తున్న విద్యార్థులను ఎంఈవో హేమలత అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుల బృందం,విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక


చొప్పదండి: విద్యార్థులను అభినందిస్తున్న టీచర్లు

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ శివారు సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక శిక్షణ పాఠశాల విద్యార్థులు రిశ్వంత్, హర్షిత్, తేజేశ్వర్ జిల్లా స్థాయి చెకుముకి పోటీలకు ఎంపికయ్యారు. మండల స్థాయి చెకుముకి పోటీల్లో ప్రతిభ కనబరిచి ఈ నెల 28 నుంచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల సిబ్బంది తెలిపారు. విద్యార్థులను డైరెక్టర్ కల్నల్ కేసీ రావు, ప్రిన్సిపాల్ కాళహస్తి, లైబ్రేరియన్ సుధాకర్‌రెడ్డి తదితరులు అభినందించారు.

జాతీయస్థాయిలో గోల్డ్‌మెడల్



వీణవంక: మండలంలోని ఘన్ముక్కుల గ్రామానికి చెందిన కాయిత లక్ష్మీప్రియ గ్రాప్లింగ్ రెజ్లింగ్‌లో సత్తా చాటి గోల్డ్‌మెడల్ సాధించింది. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు జరిగిన పోటీలలో పాల్గొని జాతీయస్థాయిలో సత్తాచాటిన లక్ష్మీప్రియను అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అభినందించారు.

వాలీబాల్ క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో టీచర్లు

సైదాపూర్: మండలంలోని ఆకునూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వాలీబాల్ క్రీడల్లో అత్యంత ప్రతిభ కనపరిచి ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులను గురువారం హెచ్‌ఎం రామస్వామి అభినందించారు. ఈ నెల 19న శంకరపట్నం మండలంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి బీచ్ వాలీబాల్ పోటీల్లో విద్యార్థులు అండర్- 14, 17 బాలికల విభాగంలో ప్రథమ, ద్వితీయ, బాలుర విభాగంలో ద్వితీయ స్థానాల్లో విజయం సాధించారు. ఆటలతో ఆరోగ్యం, చదువుతో జ్ఞానం వస్తుందని హెచ్‌ఎం రామస్వామి విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్, శాంతకుమార్, సుధాకర్, సమ్మయ్య, రవిందర్‌రెడ్డి, చిరంజీవి, సుజాత, నిర్మల ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

- **కాంగ్రెస్ పార్టీకి బుద్ధిచెప్పాలి**

చిగురుమామిడి: రైతులను అరిగోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తాల్ల నరేశ్ అన్నారు. గురువారం చిగురుమామిడిలో మాట్లాడారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదని, రైతుభరోసా ఊసే మరిచిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందని, ప్రజలను మోసం చేసిన పార్టీలను ఓడించాలని కోరారు.

- **బియ్యం అందజేత**

గన్నేరువరం: గుండ్లపల్లి గ్రామానికి చెందిన సాయి కిరణ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబసభ్యులను గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు గురువారం పరామర్శించి యాభై కిలోల బియ్యం, రూ.11,500 అందజేశారు. అలాగే డీసీసీ ఉపాధ్యక్షుడు కొమ్మెర రవీందర్‌రెడ్డి తన ఫౌండేషన్ ద్వారా రూ.రెండు వేలు అందజేశారు.

- **ఎస్సీ వర్గీకరణపై జాప్యం**

జమ్మికుంట: కొంత మంది మాల ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డిపై ఒత్తిడి తెస్తూ ఎస్సీ వర్గీకరణను జాప్యం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ మాదిగ ఆరోపించారు. గురువారం పట్టణంలో తునికి వసంత్ మాదిగ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేసి దేశంలోనే తెలంగాణ తొలి రాష్ట్రంగా నిలబెడతామని అసెంబ్లీలో ప్రకటించిన సీఎం మాట నిలబెట్టుకోలేదన్నారు.

- **టై , బెల్టులను పంపిణీ**

వీణవంక: మండలంలోని గంగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన అంకటి సురేందర్ సొంతంగా టై, బెల్టులను పంపిణీ చేశారు. హెచ్‌ఎం చంద్రకళ మాట్లాడుతూ విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు దాతలు ముందుకురావాలని కోరారు.

- **సద్వినియోగం చేసుకోవాలి**

జమ్మికుంట: మండలంలో 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ రమేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటరు నమోదు, జాబితాలో మార్పులు, చేర్పులు, తొలిగింపులు సవరణకు 23, 24వ తేదీల్లో గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

- **మత్స్యకారుల దినోత్సవం**

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో గురువారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా మండల అధ్యక్షుడు పొలవేని భిక్షపతి జెండా ఎగురవేశారు. వివిధ గ్రామాల్లో మత్స్యకారుల జెండాను ఎగురవేసి ర్యాలీ నిర్వహించారు.

చొప్పదండి: పట్టణంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ప్రధాన చౌరస్తాలో గురువారం వేడుకలను నిర్వహించారు. అనంతరం ముదిరాజ్ మహాసభ జెండా ఆవిష్కరించారు.

- **కమ్యూనికేషన్ స్కిల్స్ ట్రైనింగ్ ప్రోగ్రాం**

హుజూరాబాద్: విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని కిట్స్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ కందుకూరి శంకర్ అన్నారు. గురువారం కళాశాలలో కమ్యూనికేషన్ స్కిల్స్ ట్రైనింగ్ ప్రోగ్రాం జరిగింది. ఇంజినీరింగ్ విద్యార్థి సాంకేతిక పరిజ్ఞానంతో పాటు కమ్యూనికేషన్స్ స్కిల్స్‌తో విషయాన్ని ఇతరులకు సులభంగా వివరించాలన్నారు.

- **విద్యార్థుల క్షేత్ర సందర్శన**

హుజూరాబాద్: మండలంలోని పెద్దపాపయ్యపల్లి జీపీ పరిధిలోని నాగార్జున డెయిరీని గురువారం తుమ్మనపల్లి గ్రామ శివారులోని ఏకశిల సీబీఎస్‌ఈ విద్యార్థులు సందర్శించారు. పాలశీతలీకరణ యంత్రాలు, పాలు నిల్వ, పాల పదార్థాలను ఏ విధంగా తయారు చేస్తారో స్వయంగా పరిశీలించారు.

- **ఎమ్మెల్సీగా ఆదరించండి**

చిగురుమామిడి: నిరుద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని, ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగులకు అండగా ఉంటానని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు పిడిశెట్టి రాజు అన్నారు. మండలంలోని చిన్నముల్కనూర్‌లో గురువారం పలువురు పట్టభద్రులను కలిసి ఓటువేసి మద్దతు తెలపాలని అభ్యర్థించారు.

- **విజయవంతం చేయాలి**

శంకరపట్నం: కరీంనగర్‌లో 29,30వ తేదీల్లో నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ముకుందరెడ్డి కోరారు. మండలంలోని కేశవపట్నం పార్టీ ఆఫీసులో గురువారం మాట్లాడారు.

- **వరికొయ్యలు కాల్చొద్దు**

శంకరపట్నం: చింతగుట్టలో వరికొయ్యలు కాల్చకుండా ఏవో వెంకటేశ్ అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన చంద్రయ్య వరికొయ్యలకు నిప్పు అంటించడంతో సమాచారం అందుకున్న ఏవో రైతుకు అవగాహన కల్పించి మంటలు ఆర్పివేయించారు. రోటోవేటర్‌తో కొయ్యలు కలియ దున్నుకోవాలని రైతులకు సూచించారు.

- **క్షయవ్యాధి నివారణకు సహకరించాలి**

గంగాధర: క్షయ(టీబీ)వ్యాధి నివారణకు సహకరించాలని వ్యాధిబారి నుంచి బయటపడిన వారికి వైద్యాధికారి శ్వేతరాణి పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం క్షయవ్యాధి నివారణ విభాగం, టీబీ అలర్ట్ ఇండియా-ఇంపాక్ట్ ఇండియా ప్రాజక్టు ఆధ్వర్యంలో టీబీ చాంపియన్స్‌కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వ్యాధి లక్షణాలు, ఇతరులకు సోకకుండా, సోకిన తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని, సమాజంలో క్షయవ్యాధి నిర్మూలనకు మీవంతు సహకారం అందించాలన్నారు.

- **ఆర్టీసీ బస్సును యథావిధిగా నడిపించాలి**

గన్నేరువరం: కరీంనగర్ నుంచి చొక్కారావుపల్లె, గన్నేరువరం, ఖాసీంపేట, మైలారం గ్రామాలకు ఆర్టీసీ బస్సును యథావిధిగా నడిపించాలని నాయకులు, గ్రామస్తులు ఆర్టీసీ అధికారులకు గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు.

- **సమస్యలు పరిష్కరించాలి**

గంగాధర: రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐదు గ్యారంటీలను అమలు చేయాలని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గాజుల రవి ఆధ్వర్యంలో నాయకులు గురువారం డిప్యూటీతహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

- **అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం**

ఇల్లందకుంట: మండలంలోని వంతడ్పుల గ్రామంలో బుధవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో మిరియాల రాజమౌళి పూరిల్లు దగ్ధమైంది. జమ్మికుంట అగ్నిమాపక సిబ్బంది వచ్చేసరికి ఇల్లు కాలిబూడిద అయింది. సామగ్రి, దుస్తులతో పాటు స్టడీ సర్టిఫికెట్స్ కాలిపోయాయని, రూ.లక్షల్లో ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు. బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లి వచ్చేసరికి ప్రమాదం జరిగిందని బోరున విలపించాడు. తహసీల్దార్ రాణి ఘటనా స్థలాన్ని పరిశీలించి తక్షణ సాయం కింద యాభై కిలోల బియ్యం అందించారు.

- **కాపురానికి తీసుకెళ్లాలని భార్య ఆందోళన**

శంకరపట్నం: మండలంలోని కాచాపూర్‌లో గురువారం భర్త ఇంటి ఎదుట భార్య బైఠాయించింది. గ్రామానికి చెందిన కొక్కిస హరీశ్‌కు హుజూరాబాద్‌కు చెందిన యువతితో రెండేళ్ల క్రితం వివాహమైంది. హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న హరీశ్ కాపురానికి తీసుకుపోవడం లేదని తల్లిదండ్రులతో ఇంటి ఎదుట ఆందోళన చేసింది.

- **రోడ్డుప్రమాదంలో గాయాలు**

మానకొండూర్: మండలంలోని నిజాయితీగూడెం గ్రామానికి చెందిన కారోబార్ మొగిలి శ్రీనివాస్ గురువారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. సర్వే ఫాంలు ఇచ్చేందుకు, ట్రెజరీలో పని నిమిత్తం కరీంనగర్, మానకొండూర్ వెళ్లేందుకు ఇంటి నుంచి బైక్‌పై బయలుదేరాడు. ఈదులగట్టెపల్లి స్టేజీ వద్ద ముందుగా వెళ్తున్న లారీని శ్రీనివాస్ వెనుక నుంచి ఢీకొట్టాడు. లారీ సడెన్ బ్రేక్ వేయడంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. చేయి, తలకు గాయాలు కాగా కరీంనగర్‌కు తరలించారు.

- **చికిత్స పొందుతూ వ్యక్తి మృతి**

జమ్మికుంట: పురుగుమందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ ఆరోగ్యం తెలిపిన వివరాలు.. మండలంలోని మాచనపల్లి గ్రామానికి చెందిన కనవేన అశోక్ (29) ట్రాక్టర్, గడ్డి కట్టలు చుట్టే మిషన్ కొనుగోలు చేశాడు. ఏడాదిగా గిరాకీ లేకపోవడంతో మనస్తాపానికి గురై ఈ నెల 18న ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడు తల్లి కనకమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

జూనియర్ లెక్చరర్‌గా ఎంపిక


మార్కండేయ

మానకొండూర్: చెంజర్ల గ్రామానికి చెందిన బైరి మార్కండేయ గురువారం ప్రకటించిన టీఎస్‌పీఎస్సీ జూనియర్ లెక్చరర్ ఫలితాలలో ఇంగ్లిష్ లెక్చరర్‌గా ఎంపికయ్యాడు. మార్కండేయ ప్రస్తుతం వెల్గటూర్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నాడు. భార్య రమ్యశ్రీ వెల్గటూర్ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తోంది. 2006 డీఎస్సీలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడుగా, 2012లో నిర్వహించిన టెట్‌లో 129 మార్కులతో రాష్ట్రస్థాయి ఒకటో ర్యాంకు సాధించి స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ టీచర్‌గా ఎంపికయ్యాడు. 2012లో గ్రూప్ -2లో నాన్ ఎగ్జిక్యూటీవ్ ఉద్యోగం వచ్చినా చేరలేదు. గంగిపల్లి గ్రామానికి చెందిన రంగు విశ్వసాయి మూడు నెలల క్రితం ప్రకటించిన ఫలితాల్లో గురుకుల డిగ్రీ కాలేజీ లెక్చరర్‌గా నిర్మల్‌లోని బీసీ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలలో గణితశాస్త్రం అధ్యాపకుడిగా పనిచేస్తుండగా గురువారం ప్రకటించిన ఫలితాల్లో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యాడు.